ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ ప్రైవేటీకరణకు రంగం సిద్ధం

- పెదవేగిలో 1992లో ఫ్యాక్టరీ ప్రారంభం
- లాభాల్లో ఉన్నా ప్రభుత్వ ప్రోత్సాహం కరువు
- ఆయిల్‌పామ్ సాగు చేస్తున్న రైతులపై ప్రభావం



పెదవేగిలోని ఆయిల్ ఫెడ్ కార్యాలయం, ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ

దెందులూరు: కోట్లాది రూపాయలు లాభాల్లో ఉన్నప్పటికీ కోస్తా జిల్లాల్లో రైతుల జీవనాడిగా ఉన్న పెదవేగి ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రైవేటీకరణకు రంగం సిద్ధం కావడంపై పామాయిల్ రైతాంగం నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. పెదవేగిలోని ఆయిల్ ఫెడ్ యూనిట్ 1992లో స్థాపించిన నాటి నుంచి ఇప్పటికీ కోట్లల్లో లాభాల్లోనే నడుస్తోంది. ఆయిల్‌ఫెడ్‌కు సంబంధించిన రూ.150 కోట్ల లాభాలు ప్రభుత్వం వద్ద ఉన్నాయి. లాభాల్లో ఉన్న ఆయిల్‌ఫెడ్ ఫ్యాక్టరీని ఎవరి కోసం ప్రైవేటీకరణ చేస్తున్నారని రైతులు ప్రశ్నిస్తున్నారు. నేషనల్ మిషన్ అన్ ఎడిబుల్ ఆయిల్స్ అండ్ ఆయిల్ పామ్‌లో వేలకోట్ల నిధులు ఉన్నాయి. ఆ నిధులను ఆయిల్ ఫెడ్ కొత్త యూనిట్ నిర్మాణానికి రూ.200 కోట్లు ఆర్థిక సాయం అందించమని రాష్ట్ర ప్రభుత్వం కోరితే కేంద్రం ఇవ్వకుండా ఉంటుందా అని ప్రశ్నిస్తున్నారు.

ఏపీ ఆయిల్ ఫెడ్‌కు జవసత్వాలు కల్పించాలి

దేశంలో ఇతర రాష్ట్రాల ఆయిల్ పామ్ రైతులందరిపైనా ప్రభావం చూపే వైబులిటీ ప్రైస్‌ను ప్రకటించడానికి కేంద్రం ఏపీ ఆయిల్ ఫెడ్ పైనే ఆధారపడింది. ఇక్కడ ఆయిల్ రికవరీ శాతం (ఆయిల్ ఎక్స్ట్రాక్షన్ రేట్) ఆధారంగా ధర ఆయిల్‌పామ్ గెలలకు నిర్ణయిస్తారు. రాష్ట్రవ్యాప్తంగా 2.50 లక్షల మంది రైతులు ఆయిల్‌పామ్ సాగుపై ఆధారపడ్డారు. ఏలూరు జిల్లాలో 1.50 లక్షల ఎకరాల్లో 40వేల మంది రైతులు ఆయిల్‌పామ్ సాగుచేస్తున్నారు. రాష్ట్రంలో ఈ పంట సాగును 1990లో ప్రప్రథమంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీతోపాటు గిట్టుబాటు ధర కల్పిస్తామని హామీఇచ్చి ప్రోత్సహించారు. అంతటి ప్రాముఖ్యత కలిగిన ఏపీ ఆయిల్‌ఫెడ్‌కు జవసత్వాలు కల్పించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉంది. అధిక సామర్థ్యంతో కూడిన కొత్త యూనిట్ నెలకొల్పి తెలంగాణ కన్నా ఎక్కువ ఓఈఆర్‌లు సాధించి రైతులకు మేలు చేయాల్సి ఉంది.

విదేశీ మారక ద్రవ్యం మిగులు

ఆయిల్‌పామ్ సాగు పెరిగితే దేశానికి విలువైన విదేశీ మారక ద్రవ్యం మిగులుతుంది. తెలంగాణ కన్నా తక్కువ ఓఈఆర్ వస్తున్నా ఏపీ ఆయిల్ ఫెడ్ లాభాలు కోట్లలో ఉంటే, ఆధునిక టెక్నాలజీ కలిగి ఉన్న ప్రైవేట్ కంపెనీలకు ఎంత లాభమో అర్థం చేసుకోవచ్చు. ఆయిల్ ఫెడ్ మరమ్మతుల సమయంలో ఆయిల్ ఫెడ్ నుంచి రూ.3 వేలు అధిక ధరలకు కొనుగోలు చేస్తూ కూడా ప్రైవేట్ కంపెనీలు లాభపడుతున్నాయి. తెలంగాణ ప్రభుత్వం రైతులకు మేలు చేయటం కోసం ప్రస్తుతం ఉన్న రెండు ఆయిల్ ఫెడ్ యూనిట్లతోపాటు మరో కొత్త యూనిట్‌ను నెలకొల్పేందుకు ప్రయత్నాలు చేస్తోంది. 2023లో అప్పటి ఏపీ ఆయిల్ ఫెడ్ ఎండీ కొత్త యూనిట్ నెలకొల్పటానికి నిధులు ఇవ్వమని కేంద్రానికి లేఖ రాయడం గమనార్హం.

రాష్ట్రంలో ఇప్పటికీ నిర్ణయంకాని మద్దతు ధర

తెలంగాణ ప్రభుత్వం గత నవంబర్‌లో ఆయిల్ పామ్ గెలలకు టన్నుకు రూ. 20,410 ధర నిర్ణయించింది. ఇప్పటివరకు ఆంధ్రప్రదేశ్‌లో ధర నిర్ణయం కాలేదు. తెలంగాణ రైతులతో సమానంగా ఈ ప్రాంత రైతులకు ధర ఇవ్వాలని పలువురు కోరుతున్నారు. రైతులందరికీ మేలు జరిగేలా 2024–25 సంవత్సరానికి మద్దతు ధరపై రాష్ట్ర ప్రభుత్వం జీఓ వెంటనే ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. ఏపీలో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని ప్రైవేటీకరించే ప్రయత్నాన్ని అడ్డుకోవాలని సర్వత్రా అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఫ్యాక్టరీని ప్రైవేట్‌పరం చేస్తే ప్రైవేటీ కంపెనీలు చెప్పిన ధరే రైతులకు దక్కుతుంది.

ప్రైవేటీకరణ తగదు



పెదవేగిలోని ఆయిల్ ఫెడ్ యూనిట్ కోట్ల రూపాయల లాభాల్లో ఉంది. ఇది ప్రభుత్వం ధ్రువీకరించింది. ప్రైవేటీకరణ ప్రయత్నాలు ఎవరి కోసం చేస్తున్నారు. ప్రభుత్వం రైతులకు ఉపయోగపడే చర్యలు చేపట్టాలి. ప్రైవేటీకరణ పనులు ముందుకు వెళితే రాష్ట్ర వ్యాప్తంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం తరపున ఉద్యమిస్తాం.

– కే.శ్రీనివాసరావు, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి

నష్టం జరిగితే ఉద్యమబాట



పామాయిల్ రైతులకు నష్టం జరిగితే రైతులకు అండగా ఉంటాం. కేంద్ర ప్రభుత్వం రైతులకు నష్టం జరిగే పనులు మానుకోవాలి. అన్యాయం జరిగితే రైతులందరూ ఉద్యమం బాట పట్టే విధంగా చేస్తాం.

– ఇరుకులపాటి సాంబశివరావు, రైతాంగ సమాఖ్య రాష్ట్ర నాయకులు


ఆయిల్‌పామ్ కోస్తా ప్రాంత రైతుల జీవనాడి



పామాయిల్ సాగు కోస్తా ప్రాంతంలో ముఖ్యంగా ఉభయగోదావరి జిల్లా ప్రాంత రైతులకు జీవనాడి. క్షేత్రస్థాయిలో పంటల సాగు లాభం, నష్టం, ఎగుమతులు, దిగుమతులపై కేంద్ర, రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు సర్వే నిర్వహించాలి. వాస్తవాలు గ్రహించి ప్రభుత్వాలు ఏ నిర్ణయం తీసుకున్నా రైతులకు మేలు జరిగేలా ఉండాలి.

– జానంపేట బాబు, రైతు

క్రిస్మస్ వేడుకలకు సర్వం సిద్ధం



దెందులూరులోని ఆర్‌సీఎం చర్చి



సర్వాంగసుందరంగా సిద్ధమైన పశువుల పాక



భీమడోలు: ఆర్‌సీఎం చర్చిలో ఆకట్టుకున్న బాల ఏసు జనన వృత్తాంతం తెలిపే నమూనా



భీమడోలు: గుండుగొలనులో విద్యుత్ దీపాల అలంకరణలో ఆర్‌సీఎం చర్చి



పెదవేగి : దుగ్గిరాల్లో బాలయేసును ముస్తాబు చేసి ప్రార్థనలు చేస్తున్న యువతులు



గుండుగొలనులోని ఏసుక్రీస్తు ప్రార్థన మందిరం



గణపవరం: విద్యుత్ దీపాలంకరణలో సరిపల్లె చర్చి

దెందులూరు: ప్రపంచంలోని క్రైస్తవులంతా అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకునే పండుగ క్రిస్మస్. బుధవారం క్రిస్మస్ పండుగను వైభవంగా నిర్వహించేందుకు విశ్వాసులు, పాస్టర్లు సర్వం సిద్ధం చేశారు. పండుగను పురస్కరించుకుని వాడవాడలా చర్చిలు ముస్తాబయ్యాయి. విద్యుత్ బల్బులతో చర్చిలను ప్రత్యేకంగా అలంకరించారు. మంగళవారం రాత్రి క్యాండిల్స్‌తో ర్యాలీ చేస్తూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించడానికి ఫాదర్లు, కోర్ ఆఫీసర్లు, పాస్టర్లు, సంఘస్తులు, గ్రామాల ప్రజలు సిద్ధమయ్యారు. 10 రోజులుగా ఆయా చర్చిల్లో సంఘస్తులు, యువత, సంఘ పెద్దలు, చిన్నారులు సమష్టిగా వివిధ రంగుల విద్యుత్ బల్బులతో చర్చిల బయట, లోపల డెకరేషన్ పేపర్స్‌తో క్రిస్మస్ ట్రీలతో, స్టార్లతో సర్వాంగసుందరంగా ముస్తాబు చేశారు. అన్ని చర్చిల్లో ఫాదర్లు, పాస్టర్లు నెల రోజులుగా సెమీక్రిస్మస్‌లు నిర్వహించారు.

లోక రక్షకుని రాక కోసం..

భీమడోలు: క్రిస్మస్ వేడుకలకు క్రైస్తవాలయాలు సుందరంగా సిద్ధమయ్యాయి. క్రైస్తవ విశ్వాసులు మంగళవారం రాత్రి జాగారణ ప్రార్థనలు చేసారు. భీమడోలు, గుండుగొలను, పూళ్ల, సూరప్పగూడెం, కోడూరుపాడు, పోలసానిపల్లితో పాటు కొల్లేరులో క్రిస్మస్ శోభతో చర్చిలు ముస్తాబయ్యాయి. మండలంలోని ఆర్‌సీఎం, సీఎస్ఐ, రక్షణ సైన్యం, పెంతెకోస్తు, బైబిల్ మిషన్ తదితర చర్చిలను విద్యుత్ దీపాలతో అలంకరించి సుందరంగా ముస్తాబు చేసారు. ఆలయాల్లో ఏర్పాటు చేసిన క్రీస్తు జననానికి సంబంధించి నమూనా సెట్టింగ్‌లు ఏర్పాటు చేసారు. ఆలయాలు, ఇంటి వద్ద 20 నుంచి 30 అడుగుల ఎత్తు గల పెద్ద పెద్ద స్టార్స్‌ను ఏర్పాటు చేసారు. భీమడోలు ఆర్‌సీఎం చర్చిని విద్యుత్ దీపాలతో ఆలకరించి, చర్చిలో విద్యుత్ కాంతులతో ఉన్న పశువుల పాక ఆకట్టుకుంది.

వైభవంగా క్రిస్మస్ వేడుకలు

గణపవరం: క్రిస్మస్‌ను పురస్కరించుకుని, మంగళవారం రాత్రి క్రైస్తవ సోదరులు చర్చిల్లో క్రీస్తు జనన వేడుకలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. రాత్రి చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. గణపవరం, సరిపల్లె, వరనదరాజపురం, పిప్పర, కాశిపాడు, కేశవరం, ముప్పర్తిపాడు, కోమర్రు, డికె వల్లి, వెంకట్రాజపురం, జల్లికాకినాడ, అర్ధవరంలో చర్చిలను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

క్రిస్మస్‌కు దేవాలయాలు ముస్తాబు

పెదవేగి : క్రిస్మస్ పండుగ సందర్భంగా మండలంలోని దుగ్గిరాల, పినకడిమి, వేగివాడ, విజయరాయి, కూచింపూడి, నడిపల్లి, పెదవేగి, కొప్పాకలో చర్చిలను రంగులతో, విద్యుద్దీపాలతో అలంకరించారు. చర్చిల ఎదుట క్రీస్తు జనన ఘట్టాలను దుగ్గిరాల హోలీ ల్యాండ్ ప్రాంగణంలో సర్వాంగ సుందరంగా ఏర్పాటు చేశారు.

లోక రక్షకుడు ఏసు



ఏసుక్రీస్తు లోకరక్షకుడు, సర్వమానవాళి రక్షణ కోసం ఏసుక్రీస్తు జన్మించారు. ఏసుక్రీస్తు బోధించిన ప్రేమ, శాంతి, ఐక్యత, ఓర్పుతో ఆచరించాలి. ఆధ్యాత్మిక చింతనతోనే జీవన విధానం మెరుగుపడుతుంది.ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన సత్ప్రవర్తనతోనే మోక్షమార్గం, అభివృద్ధి ఉజ్వల భవిష్యత్తు సిద్ధిస్తుంది.

– పొలిమేర జయరావు, ఏలూరు ఆర్‌సీఎం పీఠాధిపతి

క్రీస్తు మార్గంలో జీవించాలి



ప్రజలందరూ సుఖ సంతోషాలతో దేవుని దీవెనలతో జీవించాలి. నీతి, న్యాయం, ధర్మం పాటించాలి. దేవునికి దూరంగా ఉంటే అన్యాయం, అక్రమాలు అధికమవుతాయి. దేవుడిని నమ్ముకుని సన్మార్గంలో పరోపకార బుద్ధితో జీవించాలి. ప్రజలందరూ ఒత్తిడిని దూరం చేసుకునేందుకు ప్రార్థనతో శాంతి సమాధానాలు పొందాలి.

– ఫాదర్ ఐ.మైకేల్, కెథడ్రల్ రెక్టర్

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



దెందులూరు: అంగన్‌వాడీ స్కూలో సెమీక్రిస్మస్ వేడుకలో చిన్నారుల సందడి

భీమడోలు: పోలసానిపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం సెమీ క్రిస్మిస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ షేక్ రహీమాబేగం కేక్ కట్ చేసారు. సచివాలయ ఉద్యోగులకు క్రిస్మిస్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మిఠాయిలను పంచారు. గ్రామ కార్యదర్శి యు.జయరామకృష్ణ, వార్డు సభ్యులు, సచివాలయ సిబ్బంది, వీఆర్వో సాల్మన్ రాజు, ఏఎస్ఎంలు, ఆశావర్కర్లు, డ్వాక్రా సంఘాల సీఏలు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



పోలసానిపల్లి పంచాయతీలో సెమీక్రిస్మస్ వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న నాయకులు

పాఠశాలల్లో వేడుకలు

దెందులూరు: సెమీ క్రిస్మస్ వేడుకలు గోపన్నపాలెం గ్లోబల్ స్కూల్, పోతునూరు అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించారు. సెయింట్ ఫ్రాన్సిస్ గ్లోబల్ స్కూల్లో సుపీరియర్ బ్రదర్ జోసెఫ్ క్రిబ్బును ప్రత్యేక అలంకరణ చేశారు. కేక్ కట్ చేసి పాఠశాల సిబ్బంది, గ్రామస్తులకు శుభాకాంక్షలు తెలిపారు. పోతునూరు అంగన్‌వాడీ కేంద్రంలో సూపర్‌వైజర్ శ్రీదేవి ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, సెమి క్రిస్మస్ వేడుకలు చిన్నారులతో నిర్వహించారు. కేక్ కట్ చేసి చిన్నారులకు శుభాకాంక్షలు తెలిపారు.

కేంద్ర హోంమంత్రి అమిత్‌షా రాజీనామా చేయాలి

నిడమర్రు: పార్లమెంట్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నారపల్లి రమణారావు డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమిత్‌షా వ్యాఖ్యలు అంబేడ్కర్‌ను అవమానించేలా ఉన్నాయని అన్నారు. మంగళవారం నిడమర్రులోని అంబేడ్కర్ విగ్రహానికి సీఐటీయూ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రమణారావు మాట్లాడుతూ రాజ్యాంగాన్ని రద్దు చేయడం కోసం బీజేపీ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా దాడి చేస్తోందని, దానిలో భాగంగానే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై కేంద్ర హోంశాఖ మంత్రి అవమానకర వ్యాఖ్యలు చేసారని విమర్శించారు. ఈ నిరసనలో రైతు నాయకులు వెలగలేటి మోహన్, సీఐటీయూ నాయకులు కమీలి నాని, కొనిదల విజయ్‌కుమార్ తదితరులున్నారు.



నిడమర్రులో అమిత్‌షా రాజీనామా చేయాలని నినాదాలు చేస్తున్న సీఐటీయూ నేతలు

మూర్తిరాజు సేవలు స్ఫూర్తిదాయకం

నిడమర్రు: మాజీ మంత్రి, గాంధేయవాది, విద్యాదాత చింతలపాటి శ్రీరామచంద్రమూర్తిరాజు నేటి తరం యువతకు స్ఫూర్తి దాయకమని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. మూర్తి రాజు జ్ఞాపకార్థం ఆయన స్వగ్రామంలో గ్రామస్తుల ఆర్థిక సహకారంతో మూర్తిరాజు శాంతి వనం పేరుతో పార్క్ నిర్మించారు. ఈ పార్క్‌ను ఎమ్మెల్యే ధర్మరాజు ప్రారంభించారు. అనంతరం పార్క్‌లో ఏర్పాటు చేసిన మూర్తిరాజు విగ్రహం వద్ద గ్రామ పెద్దలతో కలిసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మూర్తిరాజు స్థాపించిన పెదనింద్రకొలను జెడ్పీస్కూల్లోనే 10వ తరగతి చదివినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ రుద్రరాజు వెంకటేశ్వరరాజు (కొండయ్య), పెనుమత్స సత్తిరాజు, వాసురాజు తదితరులున్నారు.



పత్తేపురంలో మూర్తిరాజు స్మృతివనంలో ఆయన విగ్రహానికి నివాళులర్పిస్తున్న నేతలు

గుండుగొలను రోడ్డుపై ఆదమరిస్తే అంతే సంగతులు!

భీమడోలు: గుండుగొలను రోడ్డుపై రాకపోకలు సాగించే తరుణంలో వాహనచోదకులు ఆదమరిస్తే అంతే సంగతులు. అదుపు తప్పితే వాహనాలు గోదావరి కాలువలోకి దూసుకెళ్లడం ఖాయం. ప్రమాదాల బారిన పడకుండా వాహనదారులు అప్రమత్తంగా ఉంటూ జాగ్రత్తలు పాటించాల్సిందే. గుండుగొలను వద్ద జాతీయ రహదారికి అనుసంధానంగా గోదావరి కాలువపై నూతనంగా వంతెన నిర్మాణం చేపట్టారు. ఈ నేపథ్యంలో ఇరిగేషన్ కార్యాలయం వద్ద నుంచి అప్రోచ్ రోడ్డును నిర్మించారు. ఆ రోడ్డు బెయిలీ బ్రిడ్జికి చేరుకుంటుంది. ఆ రోడ్డు పటిష్టంగా లేకపోవడంతో అధిక లోడు గల వ్యాన్లు రాకపోకలు సాగిస్తుండడం, దీనికి తోడు వర్షాలు కురవడంతో వంతెన సమీపంలోని ఇరిగేషన్ కార్యాలయం వద్ద భారీ గోతులు ఏర్పడ్డాయి. అటుగా అధిక లోడుతో వెళ్లిన ఓ వ్యాన్ మంగళవారం గోతుల్లో ఇరుక్కుపోయింది. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈ రోడ్డు పక్కనే గోదావరి కాలు ఉంది. దీంతో వాహనదారులు వేరే మార్గం ద్వారా వెళ్లాలని సంబంధిత అధికారులు చెబుతున్నారు. గోతులను పూడ్చాలని ప్రజలు, వాహనచోదకులు కోరుతున్నారు.



గుండుగొలను నూతన వంతెన వద్ద గల ఏర్పడిన గొయ్యిలో ఇరుక్కున్న వ్యాన్

పారిశుద్ధ్య లేమిపై స్వపక్ష నేత నిలదీత

ఏలూరు (టూటౌన్): ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉండడంపై స్వపక్షానికి చెందిన కోఆప్షన్ సభ్యుడు చోడే వెంకటరత్నం నిలదీశారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశం మంగళవారం మేయర్ షేక్ నూర్జహాన్ అధ్యక్షతన నిర్వహించారు. అజెండాలో పొందుపరచిన మొత్తం 19 అంశాలను చర్చించారనేదాని కన్నా చదువుకుంటూ వెళ్లి పోయారనే చెప్పాలి. సమావేశంలో చోడే వెంకటరత్నం మాట్లాడుతూ ఏలూరు నగర పాలక సంస్థలో దాదాపు వెయ్యి మంది వరకు ఉన్న పారిశుద్ధ్య కార్మికులు కేవలం మస్టర్ పాయింట్ల వద్ద సంతకాలు పెట్టి ఎవరిదారిన వారు వెళ్లి పోతున్నారంటూ సభ దృష్టికి తెచ్చారు. కార్మికులు ఆత్మ పరిశీలన చేసుకుని విధులు సక్రమంగా నిర్వహించాలని కోరారు. వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ గుడిదేశి శ్రీనివాస్ కాపు కల్యాణ మండపానికి స్థలం, నిధుల కేటాయింపు అంశంపై మాట్లాడుతూ అన్ని కులాల అవసరాల మేరకు స్థలాలు కేటాయించడం మంచిదన్నారు. మేయర్ నూర్జహాన్ మాట్లాడుతూ 2019–20, 2020–21, 2021–22 ఆర్థిక సంవత్సరంలో రూ.5.35 కోట్ల అంచనా వ్యయంతో ప్రారంభించిన ఆరు పనులను రద్దు చేసేందుకు కౌన్సిల్ ఆమోదానికి ఉంచామన్నారు. వీటి స్థానంలో ఇతర అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రభుత్వానికి నివేదించనున్నట్టు తెలిపారు. తడి, పొడి చెత్త సేకరణకు సంబంధించిన 60 క్లాప్ వాహనాలను ప్రైవేట్ ఏజెన్సీ ద్వారా నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ ఏజెన్సీకి ఉన్న రూ.2.93 కోట్లు బకాయి చెల్లించే వరకు క్లాప్ వాహనాలకు ఆయిల్ ఖర్చు కార్పొరేషన్ భరిస్తున్నట్టు వివరించారు. ఏలూరు నగరంలోని రోడ్ల మరమ్మతులకు రూ.1.25 కోట్లు ఖర్చు చేస్తున్నట్టు తెలిపారు. రోడ్లు, డ్రెయిన్లు, తాగునీటి సరఫరా, వీధి లైట్లు నిర్వహణ, శానిటేషన్ వంటి వాటిపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. మొత్తంగా కౌన్సిల్ సమావేశం సాదాసీదాగా సొంత పార్టీ సభ్యుల సహకారంతో మమ అనిపించారు. కోఆప్షన్ సభ్యు డు ఎస్ఎంఆర్ పెదబాబు, పలువురు కార్పొరేటర్లు, కమిషనర్ ఎ.భాను ప్రతాప్, ఏసీ జి.చంద్రయ్య, డీసీ శివారెడ్డి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఏసుక్రీస్తు బోధనలు అనుసరణీయం

మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి



దెందులూరు: ప్రభువైన ఏసుక్రీస్తు దీవెనలు నియోజవర్గ ప్రజలతో పాటు ప్రతి ఒక్కరికీ ఉండాలని దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి మంగళవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. క్రిస్మస్ వెలుగులు ప్రతి ఇంటా ప్రసరించాలని ఆయన ఆకాంక్షించారు. క్రీస్తు బోధనలైన ప్రేమ, సేవ, ఆదరణ ప్రతి ఒక్కరికీ అనుసరణీయమన్నారు.ఈ సందర్భంగా క్రైస్తవ సోదరులందరికీ ఆయన క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు.

రబీ పంటకు బీమా ప్రీమియం చెల్లించాలి

పెదపాడు : రైతులు తమ పంటలను సురక్షిత ప్రాంతాలకు తరలించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి షేక్ అబీబ్ భాషా తెలిపారు. మండలంలోని కొక్కిరపాడు, వట్లూరులో మంగళవారం పొలం బడి కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులనుద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ వై సుబ్బారావు, మండల వ్యవసాయ అధికారి వీ ప్రదీప్‌కుమార్ గ్రామ సచివాలయ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

విష్ణాలయంలో దీపారాధన



శ్రీ విష్ణాలయంలో దీపారాధనలో పాల్గొన్న యువతులు

దెందులూరు: ధనుర్మాసం పురస్కరించుకుని దెందులూరు శ్రీ విష్ణు ఆలయంలో మంగళవారం భక్తులు స్వామివారికి వివిధ రకాల పుష్పాలతో విశిష్ట అలంకరణ, పూజలు చేశారు. దీపారాధన, కోలాటం ప్రదర్శన, ఆలయ ప్రదక్షిణ, ప్రత్యేక పూజలు వైభవంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.

వ్యాసరచన పోటీల్లో గురుకుల విద్యార్థుల ప్రతిభ

పెదపాడు : జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో వట్లూరు గురుకుల పాఠశాల విద్యార్థిని కె శృతి రాష్ట్రస్థాయిలో రెండవ బహుమతి సాధించినట్లు ప్రిన్సిపాల్ దాసరి మేరి ఝాన్సీ తెలిపారు. ఈనెల 24న ఏలూరులో నిర్వహించిన వినియోగదారుల అవగాహన సదస్సులో డీఎస్ఓ చేతులమీదుగా శృతికి నగదు బహుమతి, జ్ఞాపిక అందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దాసరి మేరిఝాన్సీరాణి పాల్గొన్నారు.

గోపినాథపట్నంలో రెవెన్యూ సదస్సు



రెవెన్యూ సదస్సుకు హాజరైన ప్రజలు

ఉంగుటూరు: గోపినాథపట్నంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దారు పోతురాజు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో రెండు అర్జీలు అందాయని అధికారులు తెలిపారు. గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

భూముల సమస్యలు పరిష్కరించుకోండి

పెదపాడు: రెవెన్యూ సదస్సులు ద్వారా భూముల సమస్యలకు సంబంధించి సమస్యలను పరిష్కరించుకోవాలని జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ రైతులకు సూచించారు. పెదపాడు మండలంలోని సత్యవోలులో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆమె మాట్లాడారు. సర్పంచ్ రంభ ఉమామహేశ్వరి, ఎంపీటీసీ రంభ నాగరాజు రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

28న సోషల్ ఆడిట్

దెందులూరు: జాతీయ ఉపాధి హామీ పథకంపై దెందులూరు మండలస్థాయిలో సోషల్ ఆడిట్ ఈ నెల 28న నిర్వహిస్తామని ఎంపీడీవో కే శ్రీదేవి తెలిపారు. సీఆర్‌పీ, ఏడుగురు డీఆర్‌పీలు, విలేజ్ సోషల్ ఆడిటర్లు మండలంలోని గ్రామాల్లో సోషల్ ఆడిట్ నిర్వహిస్తున్నారన్నారు. ఉపాధి హామీ పథకం టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు సోషల్ ఆడిట్‌లో సహకరిస్తున్నారన్నారు. గ్రామస్థాయిలో ముగిసిన తర్వాత మండల స్థాయి సోషల్ ఆడిట్ జరుగుతుందని ఎంపీడీవో అన్నారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ చాలీసా పారాయణం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ధనుర్మాసోత్సవాల్లో భాగంగా స్థానిక అగ్రహారం శ్రీ భూ, నీళా సమేత శ్రీ జనార్దన స్వామి దేవస్థానంలో ఉపాలయమైన ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం హనుమాన్ చాలీసా పారాయణం 108 సార్లు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. తొలుత స్వామి వారికి తమలపాకు పూజ, గంధం, సింధూర పూజలు చేశారు. స్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేసి విశేష పూజలు నిర్వహించారు.